www.republichindustan.in
RNI REG.NO. TELTEL/2021/83468

# రిపబ్లిక్ హిందుస్థాన్

తెలుగు దినపత్రిక




సంపుటి: 2 సంచిక: 39 | బుధవారం 03 జూన్2026 | ఆదిలాబాద్ | హైదరాబాద్ | ఎడిటర్ : రాథోడ్ రాజు | పేజీలు : 4 | వెల:రూ.2.00



## తెలంగాణ మీ అయ్య జాగీరా ?

**విజయవాడ02:** తెలంగాణ గురించి జనసేన ఎందుకు మాట్లాడుతుందని అడుగుతున్నారు. జనసేన పార్టీ పెట్టిందే హైదరాబాద్ నడిబొడ్డన.. ఇది తెలంగాణపై కొత్తగా తెచ్చుకున్న ప్రేమ కాదని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. నేను తెలంగాణ నలుమూలలా తిరిగాను. తెలంగాణ బాగుండాలని అనుకునేవాణ్ని.. ఇప్పుడు నన్ను విమర్శించేవారు ఆదిలాబాద్ లాంటి నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో తిరగలేదు. నేను తెలంగాణకు వ్యతిరేకం కాదు.. విభజన జరిగిన తీరుకు వ్యతిరేకమని అన్నారు.తెలంగాణ ప్రజలకు, నాయకులకు ఏపీ ప్రజలపై విద్వేషం లేదు. హైదరాబాద్లో ఎలా అడుగుపెడతారని కొందరు అడుగుతున్నారు. మీ అయ్య జాగీరా తెలంగాణ.. మీరెవరు నన్ను బెదిరించడానికి..? బెదిరించేవారికి ఒకటే చెబుతున్నా.. నా ఇంటి అడ్రస్ చెప్పడానికే ఇక్కడ ప్రెస్మీట్ పెట్టానని అన్నారు.



## రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా, పేదరికం నిర్మూలనే ప్రాధాన్యం

2వ పేజీలో...

**ప్రజలకు సేవకులుగా బాధ్యత నిర్వర్తిస్తున్నాం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్ 02:** తెలంగాణ స్వరాష్ట్ర అస్తిత్వం కోసం దశాబ్దాల ఉద్యమంలో ఎందరో అమరులయ్యారు. మరెందరో పోరాట యోధులుగా నిలిచారు. వారి త్యాగాలకు, తెగువకు ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం నాడు రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో అయన మాట్లాడుతూ. కోటి రతనాల వీణ.. నా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు. ప్రతి ఏటా త్యాగాల చరిత్రను స్మరిస్తూ, రేపటి భవిష్యత్ కు దిశానిర్దేశం చేసుకునే ఒక భావోద్వేగ సందర్భం జూన్ 2 మనం కలలు కన్న స్వరాష్ట్ర స్వప్నాన్ని నిజం చేసిన ఆనాటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, నాటి యు.పి.ఏ ఛైర్ పర్సన్ సోనియాగాంధీలకు తెలంగాణ సమాజం తరపున ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. పుట్టుక నీది... చావు నీది, బతుకంతా



## తెలంగాణను దేశానికే ఆదర్శంగా మార్చినం కేసీఆర్

**హైదరాబాద్ 02:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఒకనాడు వివక్షతో అల్లాడిన తెలంగాణను పదేళ్ల పాలనలో దేశానికే ఆదర్శంగా మార్చామని, సకల జనుల సంక్షేమం, సమగ్ర ప్రగతి సాధించి రాష్ట్రాన్ని నంబర్ వన్గా నిలిపామని కేసీఆర్ పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రస్తుత పాలకులకు ఆయన హితవు పలికారు.




2వ పేజీలో...

## ఉద్యమకారులను గుర్తించే కార్యక్రమం చేపట్టాం

**మంత్రి పొన్నం ప్రభాకర్**

**సిద్ధిపేట 02:** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన తరువాత తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం మూడు కార్యక్రమాలు తీసుకుంది. తెలంగాణ లో ఉన్న ప్రతి పౌరుడికి ఇందిరమ్మ జీవిత భీమా పథకం తీసుకొచ్చింది. ప్రతి కుటుంబానికి అండగా ఉండేలా కార్యక్రమాన్ని అమలు చేశాం. 2లక్షల పెన్షన్ల కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించడం జరిగింది.తెలంగాణ ఉద్యమకారులకు,కవులు, కళాకారులు,గుర్తింపు గౌరవాన్ని ఇచ్చేలా గుర్తింపు కమిటీ ఏర్పాటు చేసి వారిని గుర్తించడానికి భవిష్యత్ లో తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి గౌరవించుకోవడం, అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ఆర్టికల్ 3 ద్వారా తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. సకల జనులు తెలంగాణ ఉద్యమంలో



### శుభాకాంక్షలు తెలిపిన
## మోడీ, అమిత్ షా

**హైదరాబాద్, జూన్ 2:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్ర ప్రజలకు తెలుగులో హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ తన 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటున్న తరుణంలో నేతలిద్దరూ ట్విట్టర్ వేదికగా స్పందించారు. తెలంగాణ రాష్ట్రం సాహసం, సంకల్పం, పోరాట పటిమకు ఒక శక్తిమంతమైన ప్రతీక అని ప్రధాని మోదీ కొనియాడారు. ఇక్కడి ప్రజల సృజనాత్మకత, వ్యాపార నైపుణ్యాలు అద్భుతమైనవని, వికసిత భారత్ కలని సాకారం చేయడంలో తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ప్రధాని స్పష్టం చేస్తూ, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.అమిత్ షా సైతం తెలుగులోనే తన సందేశాన్ని పంచుకుంటూ తెలంగాణ విశిష్ట సంస్కృతిని, పారిశ్రామిక నైపుణ్యాన్ని అభినందించారు. దేశ ప్రగతిలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందని, రాబోయే రోజుల్లో ఈ రాష్ట్రం మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి దేశ కీర్తిని మరింత పెంచుతుందని ఆశిస్తున్నట్లు పేర్కొంటూ ఆయన తన సందేశాన్ని 'జై తెలంగాణ'తో ముగించారు. దేశంలోని ఇద్దరు అగ్రనేతలు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాడు ఇక్కడి ప్రజలకు గౌరవపూర్వకంగా మాతృభాషలోనే శుభాకాంక్షలు తెలపడంపై సర్వత్ర హర్షం వ్యక్తమవుతోంది



### డాలస్ లో మహాత్మాగాంధీ స్మారక స్థలిని సందర్శించిన కోమటి జయరాం
## జాతిపితకు ఘన నివాళులు

డాలస్: ఉత్తర అమెరికాకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా బాధ్యతలు చేపట్టిన కోమటి జయరాం... తొలిసారిగా అర్వింగ్ (డాలస్) లోని జాతిపిత మహాత్మా గాంధీ స్మారక స్థలిని సందర్శించారు. ఈ సందర్భంగా పూజ్య బాపూజీకి పుష్పాంజలి ఘటించారు. మహాత్మా గాంధీ మెమోరియల్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. ప్రసాద్ తోటకూర, గవర్నెన్స్ బోర్డు సభ్యులు అనంత్ మల్లవరపు... జయరాంకు స్వాగతం పలికి జ్ఞాపికతో సత్కరించారు. ప్రముఖ వ్యాపారవేత్త రామ్ గుళ్ళపల్లి, పలువురు ప్రవాస భారతీయులు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయరాం మాట్లాడుతూ.. "పుష్కర కాలం పూర్తి చేసుకుంటున్న ఇక్కడి గాంధీజీ స్మారకస్థలి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సహా వివిధ పార్టీల రాజకీయ నాయకులు సందర్శించిన ఒక స్ఫూర్తి దాయకమైన యాత్రాస్థలంగా పేర్కొన్నారు. ప్రవాస భారతీయుల ఐక్యతకు ఈ మహాత్మా గాంధీ మెమోరియల్ ఒక నిలువెత్తు నిదర్శనమని, ఈ మహత్కార్యాన్ని సాకారం చెయ్యడంలో విశేష కృషి సల్పిన గాంధీ మెమోరియల్ ఛైర్మన్ డా. ప్రసాద్ తోటకూర, వారి కార్యవర్గ బృందానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.



## జూన్ 2 మరిచిపోలేని రోజు- కేటీఆర్

**హైదరాబాద్, జూన్ 2:** తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. దశాబ్దాల తరబడి సాగిన వివక్ష, అవమానాలు, అణచివేతకు ముగింపు పలికిన జూన్ 2వ తేదీ తెలంగాణ చరిత్రలోనే అత్యంత అద్భుతమైన రోజని ఆయన అభివర్ణించారు. అమరవీరుల త్యాగాలు, ఉమ్మడి ఆత్మగౌరవ పోరాటం వల్లే తెలంగాణ ప్రజలు విముక్తి సాధించారని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు.ఉద్యమ కాలంలో వినిపించిన "తెలంగాణ వచ్చుడా... కేసీఆర్ సచ్చుడా" అనే నినాదాన్ని ప్రస్తావిస్తూ.. 60 ఏళ్ల సుదీర్ఘ కలని నిజం చేయడంలో తన తండ్రి, బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర రావు పోషించిన కీలక పాత్రను కేటీఆర్ కొనియాడారు. 14 ఏళ్ల పాటు సాగిన సుదీర్ఘ స్వరాష్ట్ర ఉద్యమంలో కానీ, ఆ తర్వాత తొమ్మిదిన్నరేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు కానీ, కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ఎల్లప్పుడూ తెలంగాణ ప్రగతి, ప్రజల సంక్షేమమే ఏకైక లక్ష్యంగా పనిచేసిందని స్పష్టం చేశారు. నేటికీ తమ పార్టీ ప్రజల గొంతుకగా నిలుస్తూ... తెలంగాణ అస్తిత్వానికి, ప్రగతికి ఒక రక్షణ కవచంలా నిలబడిందని పేర్కొన్నారు.ప్రస్తుత కాంగ్రెస్ పాలన సాగుతున్న తరుణంలో ఆయన బీఆర్ఎస్ శ్రేణులకు ఒక ప్రత్యక్ష పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం, ప్రజల సేవ కోసం ప్రతి ఒక్క బీఆర్ఎస్ కార్యకర్త పునరంకితం కావాలని కోరారు. తెలంగాణను దెబ్బతీయాలని చూస్తున్న విద్రోహ, వ్యతిరేక శక్తుల నుండి మన రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి ఈ ఆవిర్భావ దినోత్సవం సాక్షిగా మనమంతా మళ్లీ ఒకసారి ప్రతిజ్ఞ చేద్దామని కేటీఆర్ పిలుపునిచ్చారు. స్వరాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు ఈ సందర్భంగా ఆయన ఘన నివాళులర్పించారు.



### ఉద్యోగుల జీతాలను
## దారిదోపిడీ చేస్తోన్న రేవంత్ ప్రభుత్వం

**మండిపడ్డ బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రభా గౌడ్**

**హైద్రాబాద్ జూన్02:**రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందన్న నెపంతో, దాన్ని నింపుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల జీతాలను దారిదోపిడీ చేస్తోందని తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రభా గౌడ్ మండిపడ్డారు. పార్టీ రాష్ట్ర కార్యాలయం మీడియా సమావేశం లో మాట్లాడుతూ బీజేపీ ఉద్యోగుల హెల్త్ కార్డ్లకు వ్యతిరేకం కాదని,



### తెలంగాణను కొట్లాడి తెచ్చింది,
## ఇచ్చింది, అభివృద్ధి చేసింది బీజేపీయే

**బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా తెలంగాణ అవతరణ వేడుకలు**

**కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రజాద్రోహ పాలనపై నేతల ఫైర్**

హైదరాబాద్ జూన్ 2: కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రజాద్రోహ పాలనపై నేతల ఫైర్ ఐనారు.తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం (డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ భవన్)లో వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ గారు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేడుకల్లో హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీలు మల్క కొమరయ్య, అంజిరెడ్డి, జాతీయ నాయకులు పొంగులేటి సుధాకర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. గౌతంరావు, అశోక్, మాజీ మంత్రులు పెద్దిరెడ్డి,రాములు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, తదితర నాయకులు, భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ, యావత్ తెలంగాణ ప్రజలకు, ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు బీజేపీ తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భారతదేశానికి 1947లో స్వాతంత్రం వచ్చినా, తెలంగాణకు నిజమైన స్వేచ్ఛ 2014 జూన్ 2వ తేదీనే లభించిందని




### దేశంలోనే తెలంగాణను
## ఆదర్శంగా తీర్చిదిద్దిన కేసీఆర్

**హైదరాబాద్02:** పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ అద్భుతమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో దేశంలోనే తెలంగాణను ఆదర్శంగా తీర్చిదిద్దారని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. భారతదేశ చిత్రపటంలో తెలంగాణ రాష్ట్రాన్ని నిలిపిన కేసీఆర్ ఆనవాలు లేకుండా చేస్తానని అంటున్న ముఖ్యమంత్రి ఏం చేస్తారో ప్రజలకు చెప్పాలి. మరి అద్భుతమైన సెక్రటేరియట్, అమరవీరుల స్థూపం, 125 అడుగుల భారీ అంబేద్కర్ విగ్రహం, కమాండ్ కంట్రోల్ సెంటర్ లను తొలగిస్తారా? లేకుంటే యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా రాష్ట్రాన్ని మార్చిన కాళేశ్వరం ప్రాజెక్టును కూలుస్తారా? తెలంగాణ చరిత్ర ఉన్నంత వరకు కేసీఆర్ ఆనవాళ్ళు ఉంటాయి. కాయకష్టం చేసి రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేయలేని, కనీసం గోనె సంచులు కూడా అందించలేని స్థితిలో అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు, నిరుద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు పండబెట్టి తొక్కే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు.

# వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో రాష్ట్ర అవిర్భావ దినోత్సవం

**మేడ్చల్02:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మంగళవారం నాడు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ మహేశ్వరం లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మెడికల్ సూపర్నెంట్, అడిషనల్ డి ఎం ఈ డాక్టర్ బి నాగేందర్ సారథ్యంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జాతీయ గేయాన్ని ఆలపించి తదనంతరం తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ గీతాన్ని ఆలపించారు. డాక్టర్ బి నాగేందర్ ప్రసంగిస్తూ ఎందరో అమరవీరుల త్యాగ ఫలితంగా ఈరోజు తెలంగాణ ఆవిర్భవించింది తెలంగాణ ఆవిర్భవించడానికి తెలంగాణ తొలిదశ మలిదశ పోరాటంలో ఎందరో ఉద్యమ వీరులు అసువులు బాసారని అన్నారు. వారి త్యాగాల ఫలితంగానే ఈరోజు తెలంగాణ ఆవిర్భవించింది, తెలంగాణ ఉద్యమ ముఖ్యంగా నీళ్లు నిధులు నియామకాలు అనే సిద్ధాంత పరంగా సాగి ఈరోజు తెలంగాణ సాధించుకొని మన నీళ్లు మనం మన నిధులు మనం మన ఉద్యోగాలు నియామకాలు మనం జరుపుకుంటూ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నామని అన్నారు. అదేవిధంగా వైద్యరంగంలో అధునాదిక సాంకేతిక సదుపాయాలతో ఆరోగ్య తెలంగాణ దిశగా వడివడిగా అడుగులు వేస్తున్న మన తెలంగాణలో ఒకప్పుడు తక్కువ మెడికల్ కాలేజ్ లతో ఉండేది ఇప్పుడు ప్రతి జిల్లాకి ప్రభుత్వ మెడికల్ వచ్చి డాక్టర్లకి త్వరగా పదోన్నతులు మరియు ప్రజలకి అతి దగ్గరగా ఉన్నతమైన ఆరోగ్య సేవలు అందించే అవకాశం కలిగింది... ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమం అనేది మన యొక్క అభిమతం ఉద్యమానంతరం తెలంగాణ ఫలించింది ఇక మిగిలింది అభివృద్ధి కోసం మనందరం నిరంతరం శ్రమిస్తూనే



ఉండాలని అన్నారు.నిరంతర శ్రమతోనే తెలంగాణని భారత దేశంలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిపే దిశగా అందరూ తమ వంతు కృషి జరపాలని సమయపాలన పాటించి ఎవరి కర్తవ్యాన్ని వారు నిర్వహిస్తే ఖచ్చితంగా మన తెలంగాణలో అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగి అగ్రస్థానం నిలబడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కుమారి గంధం.కృష్ణయుక్త గౌడ్ కూచిపూడి నృత్యంతో ఆహ్వానితులందరినీ అలరింప చేయడం జరిగింది. ఈ సమావేశంలో సూపర్డెంట్ డాక్టర్ బి నాగేందర్ మరియు వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఉమా శంకర్ ఆర్ఎంఓ దామోదర్ రావు సి ఏ ఎస్ ఆర్ ఎమ్ ఓ డాక్టర్ రాజ్ కుమార్ మరియు వివిధ డిపార్ట్మెంట్లో హెచ్వోడీలు డాక్టర్ అనిత డాక్టర్ అనిల్ కుమార్ ఆసుపత్రి ఏవో ఈహెచ్ఎస్ వెల్నెస్ సెంటర్ ఇన్చార్జి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి శాంతి కుమార్ , క్టర్ భాస్కర్ డాక్టర్ ప్రజ్ఞా, రు సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణను కొట్లాడి తెచ్చింది,ఇచ్చింది, అభివృద్ధి చేసింది బీజేపీయే

స్పష్టం చేశారు. తెలంగాణ సాధనలో ఎందరో తామే తెచ్చామని ప్రగల్భాలు పలుకుతున్నారని, కానీ 1947 నుండి 2014 వరకు తెలంగాణ కోసం నిరంతరం కొట్లాడింది, పార్లమెంట్‌లో ఇచ్చింది, ఇప్పుడు అభివృద్ధి చేస్తోంది కూడా బీజేపీయేనని సగర్వంగా ప్రకటించారు. నేడు దేశంలో తలసరి ఆదాయంలో తెలంగాణ రెండో స్థానంలో ఉండటానికి, ఇక్కడ అత్యధికంగా ధాన్యం పండటానికి ప్రధాని నరేంద్ర మోదీ చలవే కారణమని గుర్తుచేశారు. తెలంగాణకు మొదటి బలిదేవుడు నెహ్రూ అని, రజాకార్ల అరాచకాల్లో తెలంగాణ నలుగుతున్నా నెహ్రూ పట్టించుకోలేదని, సర్దార్ వల్లభాయ్ పటేల్ 'ఆపరేషన్ పోలో' ద్వారానే సెప్టెంబర్ 17న తెలంగాణకు విమోచనం కలిగిందని వివరించారు. అప్పట్లో ఆర్ఎస్ఎస్, ఆర్యసమాజ్, హిందూ మహాసభలు కీలక పాత్ర పోషించాయన్నారు. ఆ తర్వాత కూడా నెహ్రూ బలవంతంగా తెలంగాణను ఆంధ్రలో కలిపారని, 1969 తొలిదశ ఉద్యమంలో 369 మంది యువకులను కాంగ్రెస్ తూటాలకు బలి తీసుకుందని, అందుకు రెండో బలిదేవత ఇందిరాగాంధీ అని దుయ్యబట్టారు. 2004లో యూపీఏ అధికారంలోకి వచ్చినా తెలంగాణ ఇవ్వకుండా 1000 మందికి పైగా యువతను బలితీసుకున్న మరో బలిదేవత సోనియా గాంధీ అని ఆరోపించారు. కానీ బీజేపీ ఎన్నడూ వెనకడుగు వేయకుండా, 1997 కాకినాడ తీర్మానంలో 'ఒక్క ఓటు - రెండు రాష్ట్రాలు' అనే తీర్మానంకి కట్టుబడి ఉందన్నారు. వాజ్ పేయి హయాంలో 2000 సంవత్సరంలో ఉత్తరాఖండ్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ అనే మూడు చిన్న రాష్ట్రాలను ఏర్పాటు చేసి పరిపాలనా దక్షతను నిరూపించారని గుర్తుచేశారు. మలిదశ ఉద్యమంలో జేఏసీ ఆధ్వర్యంలో బండారు దత్తాత్రేయ, ఇంద్రసేనారెడ్డి, విద్యాసాగర్ రావు, స్వర్గీయ ఆలె నరేంద్ర, కిషన్ రెడ్డి గార్లు నిస్వార్థంగా పోరాడారన్నారు. 2012లో అప్పటి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి గారు 80 నియోజకవర్గాల్లో 3000 కిలోమీటర్ల పొడవునా చేసిన 'తెలంగాణ పోరు యాత్ర' చారిత్రాత్మకమైనదన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ చిన్నమ్మ

మొదటిపేజీ తరువాయి...

స్వర్గీయ సుష్మా స్వరాజ్ గారు లేడీ సింగంలా గర్జించి కాంగ్రెస్‌ను నిలదీయడం వల్లే ఏపీ రీఆర్గనైజేషన్ బిల్లు సాధ్యమైందని స్పష్టం చేశారు. అయితే, ఇంతమంది త్యాగాలతో సిద్ధించిన తెలంగాణలో కొన్ని కుటుంబాలు మాత్రం లక్షల కోట్ల ఆస్తులు సంపాదించుకుని ఫామ్‌హౌస్‌లలో ఎంజాయ్ చేస్తుంటే, ఉద్యమకారులు మరియు అమరవీరుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. యువతకు ఉద్యోగాలు, ఉపాధి లేక పెళ్లిళ్లు కూడా కాని దౌర్భాగ్య స్థితి నెలకొందన్నారు. గడిచిన 12 ఏళ్లలో రూ. 24 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టి, రూ. 10 లక్షల కోట్ల అప్పులు చేసినా, ఉద్యమకారుల సంక్షేమం కోసం కనీసం రూ. 500 కోట్లు కూడా ఖర్చు చేయలేదని మండిపడ్డారు. ప్రస్తుత రేవంత్ రెడ్డి సర్కార్ ఒక 'వీక్లీ వేజ్ గవర్నమెంట్' లా మారిందని, ప్రతి వారం ఢిల్లీకి మూటలు పంపితే తప్ప ముఖ్యమంత్రి పదవి రిన్యూ కాదనే పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్నామంటున్నారని, కానీ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎక్సెస్ కరెంట్ ఇవ్వడం వల్లే ఇదిసాధ్యమవుతోందని, డిస్కమ్‌లను రూ. లక్ష కోట్ల అప్పుల్లో ముంచింది ఇక్కడి పాలకులేనని విమర్శించారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో, కేవలం తెలంగాణ నుంచే 60 లక్షల మెట్రిక్ టన్నులను (70 శాతం) మోదీ ప్రభుత్వం కొనుగోలు చేసిందని గణాంకాలతో వివరించారు. రైతులకు న్యాయం చేయడం చేతకాకుంటే కాంగ్రెస్ మంత్రులు రాజీనామా చేయాలని, బీజేపీ అధికారంలోకి వస్తే ప్రతి గింజనూ కొని రైతును ఆదుకుంటుందని సవాల్ విసిరారు. రాబోయే 2029 జూన్ 2వ తేదీన తెలంగాణలో అధికారికంగా కాషాయ జెండా నీడలో తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాలు జరుపుకుంటామని, ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు అత్యున్నత గౌరవం కల్పిస్తామని డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ స్పష్టం చేశారు.

# రాష్ట్ర అభివృద్దే ద్యేయంగా, పేదరికం నిర్మూలనే ప్రాధాన్యం

మొదటిపేజీ తరువాయి...

దేశానిది" అన్న ప్రజా కవి కాళోజీ మాటలే స్ఫూర్తిగా డిసెంబర్ 7, 2023 న బాధ్యతలు స్వీకరించిన క్షణం నుండి ప్రతిక్షణం తెలంగాణ హితమే పరమార్థంగా, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా, పేదరికం నిర్మూలనే ప్రాధాన్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోంది. రాష్ట్రంలో అధికారం ఇవ్వడంతో పాటు, ఈ రెండున్నరేళ్లలో జరిగిన పలు ఉప ఎన్నికల్లో, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో మా పట్ల మీరు చూపించిన ఆదరణ, అభిమానం మరువలేనిది. ఎవరెన్ని విమర్శలు, కుట్రలు చేసినా ప్రజలు మాకు అండగా నిలవడం ఎనలేని శక్తిని ఇచ్చింది. ప్రజల సంక్షేమం పట్ల, రాష్ట్ర అభివృద్ధి పట్ల మా బాధ్యతను మరింత పెంచిందని అన్నారు.రైతులు, యువత, ఆడబిడ్డల ఆకాంక్షలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ పేద వర్గాల సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి సాధన కోసం పలు విధాన నిర్ణయాలు తీసుకుంటూ, కార్యచరణ చేసుకుంటూ రెండున్నరేళ్లుగా నిరంతరం శ్రమిస్తున్నాం. అభివృద్ధితో పాటు సంక్షేమానికి సమపాళ్లలో ప్రాధాన్యత ఇస్తూ పాలన సాగిస్తున్నాం. ఈ రోజు నేను గర్వంగా చెప్పగలను... దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని సంక్షేమ పథకాలను తెలంగాణలో మనం అమలు చేస్తున్నాం.అభివృద్ధి, సంక్షేమం ఒక ఎత్తు. ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం మరో ఎత్తు. తెలంగాణ ఆవిర్భావం ఒక ప్రత్యేక ఘట్టం. దశాబ్దాలు ఉద్యమం చేసి రాష్ట్రాన్ని సాధించుకున్నది కేవలం సంక్షేమం, అభివృద్ధి కోసం కాదు. ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కోసం ఈ గడ్డపై ప్రతి బిడ్డ పోరాటం చేశారు. పెత్తందారీ తనానికి వ్యతిరేకంగానే పోరాటాలు జరిగాయని అన్నారు.నాటి రాచరికం నుంచి నిన్నటి నియంతృత్వం వరకు తెలంగాణ తిరుగుబాటు చరిత్ర మొత్తం చెబుతున్న సత్యం ఇదే. ఆ చరిత్రకు మనం సాక్షులం. రాచరిక ఆలోచనలు, నియంతృత్వ పోకడలను ఓడించి కొత్త చరిత్రను



రాసుకోవడం కోసం మీరు ప్రజా ప్రభుత్వాన్ని గెలిపించుకున్నారు. ఈ రోజు ప్రజల మనోభావాలకు మేం ప్రతినిధులం. సమాజ ఆకాంక్షలకు మేం వారధులం. అందుకే మీరిచ్చిన ఈ అవకాశాన్ని మేం అధికారం.. అని సంభోదించడం లేదు. మమ్మల్ని మేం పాలకులుగా అనుకోవడం లేదు. మీకు సేవకులుగా బాధ్యత నిర్వర్తిస్తున్నాం. ప్రభుత్వం అంటే నలుగురు చేతుల్లో పెత్తనం కాదు... నాలుగు కోట్ల ప్రజల ఉమ్మడి ప్రతినిధి.. అని మేం భావిస్తున్నాం... బాధ్యతగా పని చేస్తున్నాం. అందుకే ఇది కేవలం పరిపాలన చేసే ప్రభుత్వం కాదు... ప్రజాస్వామ్య ఆకాంక్షలను నెరవేర్చే ప్రజా ప్రభుత్వం అని గర్వంగా చెబుతున్నామన్నారు.డిసెంబర్ 7, 2023న ప్రారంభమైన మన ప్రభుత్వం ప్రజలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడానికి ప్రాధాన్యతనిస్తూ వస్తోంది. రకరకాల అడ్డంకులు అధిగమిస్తూ 30 నెలల్లోనే ప్రజల ఆశలు, ఆశయాలను నెరవేర్చడంలో విజయవంతంగా ముందుకు సాగుతున్నామని అన్నారు.

## ఉద్యోగుల జీతాలను దారిదోపిడీ చేస్తోన్న రేవంత్ ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి...

కానీ దానికి ఒక సరైన ప్రణాళిక ఉండాలని ఆయన పేర్కొన్నారు. కనీసం జీఓ ఆర్డర్ లేకుండా, హెల్త్ కేర్ ట్రస్ట్ గానీ, ఒక సీఈఓను గానీ నియమించకుండా ఈ ప్రక్రియను నడపడం ఉద్యోగులను మోసం చేయడమేనన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులతో చర్చలు జరిపి, ఎంపానెల్డ్ ఆసుపత్రుల జాబితాను, రోగాల వారీగా ప్యాకేజీల వివరాలను వెంటనే పబ్లిష్ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ప్రీమియం తీసుకోకుండా 'ఆయుష్మాన్ భారత్' ద్వారా రూ. 5 లక్షల ఉచిత వైద్యం అందిస్తుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రజల జేబులు గుల్ల చేస్తోందని విమర్శించారు. ఇంట్లో భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగులైతే ఇద్దరి దగ్గరా కట్ చేస్తూ, ఏడాదికి రూ. 40,000 వరకు లాక్కోవడం వల్ల ఇది ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంటే కాస్ట్‌లీగా మారిందన్నారు. 25 ఏళ్లు పైబడిన పిల్లలకు ఇది వర్తిస్తుందా? ప్రీమియం లిమిట్ ఎంత? అనే విషయాలపై స్పష్టత లేదని, కేవలం 36% మంది మాత్రమే ఆన్‌లైన్ నమోదు చేసుకున్నా, మిగతా అందరి జీతాల్లో కోత విధించడం దారుణమని ప్రభా గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత చర్యల వల్ల నేడు ఉద్యోగ సంఘాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయని గుర్తుచేశారు. ఒకపక్క రైతులను, మరోపక్క ఉద్యోగులను అరిగోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే మేల్కొని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేకపోతే రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని ప్రభా గౌడ్ హెచ్చరించారు.


## ఉద్యమకారులను గుర్తించే కార్యక్రమం చేపట్టాం

మొదటిపేజీ తరువాయి...

పాల్గొన్నప్పటికీ కేసులు,దాడులు,నష్టపోయిన వారిని గౌరవించి గుర్తించే కార్యక్రమం తీసుకుంటున్నాం.తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వంలో మొదటి దశలో ఒక్కో నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లు నిర్మించడం జరిగింది.రెండవ దశలో సోమవారం ఇందిరమ్మ ఇళ్లు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఆసిఫాబాద్ లో ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు లో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. వ్యవసాయ అధికారులు,రైతులతో సమావేశం త్వరలోనే ఏర్పాటు చేస్తాం. జిల్లాలో సంవత్సరానికి లక్షా 50 వేల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం అవసరం కానీ ఇక్కడ 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం పండుతుంది.రైతులు మనకు అవసరమైన సన్న బియ్యం పండించేలా విత్తనాల నుండే అవగాహన కల్పిస్తాం.ప్రతి రైతు ఆయిల్ ఫామ్ సాగు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం మన దగ్గర నర్మేట లో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభమైంది.ప్రతి ఉద్యోగి జర్నలిస్ట్ లు ప్రతి ఒక్కరు ఏకకాలంలో మొక్కలు నాటేలా గ్రామగ్రామ నా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. మా నియోజకవర్గంలో ప్లాంటేషన్ పై ఐదుగురు సభ్యులతో కమిటీ వేసుకున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా అలాంటి కమిటీ వేసేలా ప్లాన్ చేస్తున్నాం.

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజునే అమరవీరుల స్థూపాన్ని నిర్లక్ష్యం చేయడం సిగ్గుచేటు

### ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్ రాజు



తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలకు ప్రతీకగా నిలిచిన దుండిగల్ అమరవీరుల స్థూపాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేయడం అత్యంత బాధాకరమని ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్ రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు.తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వంటి అత్యంత పవిత్రమైన రోజున కూడా అమరవీరుల స్థూపాన్ని అధికారులు పట్టించుకోకపోవడంతో, ఉద్యమకారులతో కలిసి స్వయంగా స్థూపాన్ని నీటితో శుభ్రం చేసి అమరవీరులకు పుష్పాంజలి ఘటించినట్లు తెలిపారు.×తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి వేలాది మంది విద్యార్థులు, యువకులు, ఉద్యమకారులు చేసిన త్యాగాలను గుర్తు చేసుకోవాల్సిన రోజునే అమరవీరుల స్మారక స్థూపం నిర్లక్ష్యానికి గురికావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు.రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున కూడా అమరవీరుల స్థూపాన్ని పట్టించుకోకపోతే మరెప్పుడు పట్టించుకుంటారు? తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఇదేనా ప్రభుత్వం ఇచ్చే గౌరవం? అని శంభీపూర్ రాజు ప్రశ్నించారు.×అమరవీరుల స్థూపాల సంరక్షణను విస్మరించడం అంటే కేవలం ఒక నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేయడం కాదు, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని, అమరవీరుల త్యాగాలను, ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని అవమానపరచడమేనని మండిపడ్డారుతెలంగాణ ఉద్యమ చరిత్రను, అమరవీరుల త్యాగాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఇకనైనా నిర్లక్ష్య వైఖరిని వీడి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అమరవీరుల స్థూపాల సంరక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.×తెలంగాణను సాధించిన అమరవీరుల త్యాగాలను మరచిపోయే ప్రభుత్వాలను చరిత్ర ఎన్నటికీ క్షమించదని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు హెచ్చరించారు.

# భక్తుల ఆరోగ్య భద్రతే టీటీడీ ప్రధాన లక్ష్యం

**తిరుపతి02:** భక్తుల ఆరోగ్యం, ఆహార భద్రతకు టీటీడీ అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని టీటీడీ అదనపు ఈవో సి. హెచ్. వెంకయ్య చౌదరి తెలిపారు. తిరుమలలోని ఎస్వీ మ్యూజియం ఆడిటోరియంలో మంగళవారం, టీటీడీ ఆరోగ్య శాఖ, ఈయూంఎ, నెస్లే ఇండియా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఆహార భద్రత, పరిశుభ్రతలపై మూడు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు ఈవో మాట్లాడుతూ తిరుమలకు ప్రతిరోజూ లక్షలాది మంది భక్తులు విచ్చేస్తున్న నేపథ్యంలో వారికి నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందించడం టీటీడీ బాధ్యత అని అన్నారు. ఆహార తయారీ, నిల్వ, పంపిణీ ప్రక్రియల్లో పరిశుభ్రత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ఇప్పటికే తిరుమలలో ఆహార భద్రత, పరిశుభ్రతపై పలు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించినప్పటికీ, వాటిని నిరంతరం కొనసాగించేందుకు ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతో అవసరమని చెప్పారు. టీటీడీ అన్నప్రసాదంలో నాణ్యమైన ఆహార ప్రమాణాలను ఖచ్చితంగా పాటిస్తోందన్నారు. అదే రీతిలో తిరుమల లోని వివిధ



హోటల్స్ కూడా ఉన్నత ఆహార ప్రమాణాలను పాటించాలని ఆదేశించారు. తిరుమలలో ప్రస్తుతం సుమారు 325 దుకాణాల్లో(బబితీవవబి లవనిటనీతీబ) ఆహార విక్రయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని, వాటిలో దాదాపు 1,300 మంది సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు. సంస్థల యజమానులు తమ సిబ్బందికి పరిశుభ్రత, ఆహార భద్రత ప్రమాణాలపై నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు.

# జాతీయ క్రీడాకారిణికి సన్మానం

**తిర్యాణి 02:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తిర్యాణి మండల కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో కన్నేపల్లి గ్రామానికి చెందిన జాతీయ స్థాయి క్రీడాకారిణి ఆత్రం హర్షిణి (అమ్ములు)ను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, జిల్లా నాయకుడు హనుమండ్ల జగదీష్ ఘనంగా సన్మానించారు. జాతీయ స్థాయిలో హ్యాండ్‌బాల్‌లో స్వర్ణ పతకం, షూటింగ్ బాల్‌లో కాంస్య పతకం సాధించి తెలంగాణ రాష్ట్రానికి, గిరిజన సమాజానికి గుర్తింపు తీసుకొచ్చిన హర్షిణి ప్రతిభను ఆయన అభినందించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని జాతీయ స్థాయిలో రాణించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హర్షిణి తల్లిదండ్రులు ఆత్రం సంతోష్ కుమార్, వెంకటమ్మలను శాలువాలతో సత్కరించారు. కుమార్తె విజయాల వెనుక వారి కృషి, ప్రోత్సాహం అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో హర్షిణి మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని తెలంగాణకు మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, వైస్ చైర్మన్ చుంచు



శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, చింతపల్లి సర్పంచ్ చిక్రం కృష్ణ, తిర్యాణి ఉపసర్పంచ్ చేని కుమార్, నాయకులు తోట లచ్చన్న, బుర్ర మధుకర్, ముత్యం రాజయ్య, ఆకుల సత్తయ్య, ముత్యాల దర్శన్, కాసం రాజయ్య, నాయకపు గూడ మాజీ సర్పంచ్ మధుకర్, వెన్న సంతోష్, రేగొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# హర్షిని విజయం తిర్యాణికి గర్వకారణం

### బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు హనుమాండ్ల జగదీష్

**తిర్యాణి 02:** జేఈఈ అడ్వాన్స్‌డ్--2026 ఫలితాల్లో జాతీయ స్థాయిలో 1487వ ర్యాంకు సాధించిన బోగ్గుల హర్షిని తిర్యాణి మండలానికి గర్వకారణమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, జిల్లా నాయకుడు హనుమాండ్ల జగదీష్ అన్నారు. మంగళవారం హర్షినికి శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని దేశవ్యాప్తంగా ప్రతిభ చాటుతూ అత్యుత్తమ ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. హర్షిని కృషి, పట్టుదలతో ఈ విజయాన్ని అందుకుందని, ఆమె సాధించిన ఫలితం మండలంలోని విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఉన్నత విద్యలో మరిన్ని విజయాలు సాధించి తిర్యాణి పేరును దేశవ్యాప్తంగా చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, వైస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, చింతపల్లి సర్పంచ్ చిక్రం కృష్ణ, తిర్యాణి ఉ



పసర్పంచ్ చేని కుమార్, నాయకులు తోట లచ్చన్న, బుర్ర మధుకర్, ముత్యం రాజయ్య, ఆకుల సత్తయ్య, ముత్యాల దర్శన్, కాసం రాజయ్య, నాయకపు గూడ మాజీ సర్పంచ్ మధుకర్, వెన్న సంతోష్, రేగొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

R. HINDUSTAN రిపబ్లిక్ హిందుస్థాన్ తెలుగు దినపత్రిక

# విద్యార్థులకు వరం... మాస్టర్ మైండ్స్ తరగతులు

**జూన్ 11 నుంచి ఆన్‌లైన్ బోధన ప్రారంభంసద్వినియోగం చేసుకోవాలి**

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి 02:** జిల్లాలో పదో తరగతి విద్యార్థుల విద్యా ప్రగతిని లక్ష్యంగా పెట్టుకుని విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాస్టర్ మైండ్స్ గూగుల్ మీట్ ఆన్‌లైన్ తరగతులను విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కె. హరిత పిలుపునిచ్చారు. గత నాలుగు సంవత్సరాలుగా విజయవంతంగా కొనసాగుతున్న ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో మాస్టర్ మైండ్స్ ఆన్‌లైన్ తరగతుల ప్రచార ప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రతి రోజు ఉదయం 4.45 గంటల నుంచి నిర్వహిస్తున్న ఆన్‌లైన్ తరగతులు అద్భుత ఫలితాలను అందిస్తున్నాయని తెలిపారు. గత సంవత్సరాల్లో ఈ తరగతులను అనుసరించిన విద్యార్థులు వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించి జిల్లాకు పేరు తీసుకొచ్చారని పేర్కొన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి జూన్ 11 నుంచి మాస్టర్ మైండ్స్ ఆన్‌లైన్ తరగతులు ప్రారంభం కానున్నాయని, జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పదో తరగతి విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. పాఠ్యాంశాలపై పట్టు సాధించడంతో పాటు పరీక్షల పట్ల ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడానికి ఈ తరగతులు ఎంతో దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరవుతూ, ఉపాధ్యాయులు అందించే మార్గదర్శకాలను పాటిస్తే వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడం సాధ్యమవుతుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈ సందర్భంగా మాస్టర్ మైండ్స్ కార్యక్రమ సమన్వయకర్తలు, జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్, ధర్మపురి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. సంబంధిత అధికారులు, విద్యాశాఖ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్, ప్రజా సంబంధాలు) హర్కర వేణుగోపాలరావు**





**మంచిర్యాల ప్రతినిధి 02:** రాష్ట్రంలోని ప్రజల సంక్షేమం, అభివృద్ధి కొరకు ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్, ప్రజా సంబంధాలు) హర్కర వేణుగోపాలరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ. భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య లతో కలిసి మంచిర్యాల పట్టణంలో అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మినిమం వేజ్ బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్, రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య లతో కలిసి హాజరై హాజరై పోలీసు గౌరవ వందనం స్వీకరించి, జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ తల్లి విగ్రహానికి పూల సమర్పణ చేశారు. ఈ సందర్భంగా ప్రగతి సందేశాన్ని అందించారు. ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కొరకు అహర్నిశలు శ్రమిస్తుందని, రైతులు, మహిళల సంక్షేమాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, విద్య, వైద్య రంగాల బలోపేతానికి కృషి చేస్తూ ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సౌకర్యం కొరకు సకల సదుపాయాలు కల్పిస్తుందని తెలిపారు. అనంతరం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు మంజూరైన మోటారు సైకిళ్ళు, ల్యాప్ టాప్ లు, వీల్ చైర్లు ఇతరత్ర అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ఆలపించిన గీతాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లాలో నాలుగు రోజులపాటు గ్రామ, వార్డు సభలు

**అధికార యంత్రాంగం సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించాలి**




**ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి 02:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలోని 335 గ్రామపంచాయతీలు, రెండు మున్సిపాలిటీల పరిధిలో ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో నిర్వహించనున్న గ్రామ సభలు, వార్డు సభలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత సూచించారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సి.ఎస్. రామకృష్ణారావు, రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌తో కలిసి హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన కార్యాచరణను గ్రామస్థాయికి చేర్చేలా సభలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. గ్రామ సభలు, వార్డు సభల్లో కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, మహిళల భద్రత, మాదకద్రవ్యాల నివారణ, రహదారి భద్రత, పర్యావరణ పరిరక్షణ అంశాలపై చర్చలు నిర్వహించాలని సూచించారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయడంతో పాటు ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.

వర్షాకాలం దృష్ట్యా గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరం చేయాలని, మురుగు కాలువల శుభ్రత, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు చేపట్టాలని పేర్కొన్నారు. నీరు నిలిచే ప్రాంతాలను ముందుగానే గుర్తించి తగిన నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యే పరిస్థితుల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ గ్రామ సభలు, వార్డు సభలకు సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజలకు సమగ్ర సమాచారం అందించాలని ఆదేశించారు. ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచడంతో పాటు వనమహోత్సవం కోసం మొక్కలను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్పీ నితికా పంత్, అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం. డేవిడ్, ఆసిఫాబాద్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్, ప్రజా సంబంధాలు) హర్కర వేణుగోపాలరావు**



**మంచిర్యాల ప్రతినిధి 02:** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు (ప్రోటోకాల్, ప్రజా సంబంధాలు) హర్కర వేణుగోపాల్ రావు అన్నారు. 99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మినిమం వేజ్ బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్, రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య, ఇతర ప్రభుత్వ అధికారులు, కాలుష్య నియంత్రణ మండలి ఎ.ఇ.ఇ. వీరేశ్ లతో కలిసి ప్లాస్టిక్ కాలుష్యంపై అవగాహన గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సలహాదారు మాట్లాడుతూ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి హానికారక ప్రభావం కలుగుతుందని, ప్లాస్టిక్ వినియోగం వల్ల భూమి, నీరు, జీవ వ్యవస్థలకు నష్టాలు జరిగే ప్రమాదం ఉందని తెలిపారు. నిత్యజీవితంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడానికి నియమాలు, ప్రత్యామ్నాయ మార్గాలు పాటించాలని, పర్యావరణాన్ని కాపాడడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# గ్రామ, వార్డు సభలు సమర్థవంతంగా నిర్వహించాలి

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు**



**మంచిర్యాల ప్రతినిధి 02:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో రాష్ట్రంలోని అన్ని గ్రామపంచాయతీలలో గ్రామసభలు, మున్సిపల్ కార్పొరేషన్లు/ మున్సిపాలిటీలలో డివిజన్/వార్డు సభలు సమర్థవంతంగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర డిజిపి సివి ఆనంద్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల అధికారులతో సభల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో గ్రామపంచాయతీలలో, మున్సిపల్ కార్పొరేషన్/మున్సిపాలిటీలలో డివిజన్/వార్డులలో నిర్వహించనున్న సభలకు సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు. సభలలో కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ కార్యక్రమం ఉద్దేశాన్ని వివరించాలని, పర్యావరణ పరిరక్షణపై చర్చించాలని, యాసంగి వరి ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలు వేగవంతం చేయాలని తెలిపారు. వచ్చే ఖరీఫ్ సీజన్ లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలు, ఎరువులు అందించేందుకు ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. సభలలో మహిళల రక్షణ, మాదకద్రవ్యాల నివారణ, రహదారి భద్రతపై వివరించాలని తెలిపారు. వచ్చే వర్షాకాలంలో గ్రామాలలో పారిశుధ్యం, మురుగు కాలువల శుభ్రత, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు, భారీ వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి తరలించాలని తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలను సిద్ధం చేసుకోవాలని, రాష్ట్ర, కేంద్ర ప్రకృతి విపత్తుల ప్రతిస్పందన బృందాలను, రెస్క్యూ బృందాలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామపంచాయతీలు, 1 మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సభలు నిర్వహణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వచ్చే ఖరీఫ్ సీజన్ కు రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో ప్రతి రోజు పారిశుధ్య పనుల నిర్వహణపై పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. 4 రోజుల పాటు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గ్రామసభలు, డివిజన్/వార్డు సభలు అధికారుల సమన్వయంతో నిర్వహించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, మున్సిపల్ కమిషనర్లు, విద్యుత్, ముఖ్య ప్రణాళిక శాఖల అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వేసవి శిబిరంలో ప్రతిభ కనబరచిన హెచ్ ఎం లకు ఘన సన్మానం



**ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి 02:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా జాతీయ హరిత దళం ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిబిరంలో విశిష్ట ప్రతిభ కనబరిచిన జిల్లాలోని మూడు ప్రధాన మంత్రి పాఠశాలల ప్రధానోపాధ్యాయులను జిల్లా కలెక్టర్ కె. హరిత ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రశంసా పత్రాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. వేసవి శిబిరంలో పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ, నీటి వనరుల పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, మొక్కల పెంపకం వంటి అంశాలపై విద్యార్థులు, ఉపాధ్యాయులు చేపట్టిన వినూత్న కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ సన్మానం నిర్వహించారు. జిల్లాలోని విద్యాసంస్థల్లో పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించడంలో ఈ పాఠశాలలు ఆదర్శంగా నిలుస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. సన్మానం పొందిన వారిలో బాబాసాగర్ జిల్లా పరిషత్ మాధ్యమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దెబ్బటి సత్యనారాయణ, పెంచికల్పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మల, వాంకిడి జిల్లా పరిషత్ మాధ్యమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నటరాజు ఉన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణను విద్యా కార్యక్రమాల్లో భాగం చేస్తూ విద్యార్థుల్లో ప్రకృతి పట్ల బాధ్యతాభావాన్ని పెంపొందించాలని సూచించారు. హరిత తెలంగాణ లక్ష్య సాధనలో ప్రతి పాఠశాల భాగస్వామ్యం కావాలని, పర్యావరణ హిత కార్యక్రమాలను విస్తృత స్థాయిలో చేపట్టాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో జాతీయ హరిత దళం జిల్లా సమన్వయకర్త, పర్యావరణ విద్య రాయబారి కటకం మధుకర్ పాల్గొని వేసవి శిబిరం విజయవంతానికి సహకరించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు. జిల్లాలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను మరింత విస్తృతపరచేందుకు జాతీయ హరిత దళం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమం జిల్లాలోని విద్యా, పర్యావరణ రంగాలకు నూతన ఉత్సాహాన్ని నింపిందని అధికారులు పేర్కొన్నారు

# ఎంపీడీవోకు గ్రామపంచాయతీ కార్మికుల వినతిపత్రం

**కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్**



**సిర్పూర్(యు),కెరమెరి 02:** గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అంజత్ పాషాకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ మండల అధ్యక్షుడు తిరుసుల్ల సంతోష్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని కోరారు. అదేవిధంగా నెలకు రూ.26 వేల వేతనం అమలు చేయడం, యూనిఫార్మ్‌లు అందజేయడం, కార్మిక సంక్షేమానికి సంబంధించిన ఇతర సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో గడ్డల వెంకటేష్, పోర్ల స్వామి, కూటికెల నాగేష్, మల్లేష్, వెంకటేష్, శ్రీనివాస్, వాగ్మారే గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# రొంపి కుంటలో ఆవిర్భావ వేడుకలు.



కమాన్ పూర్ జూన్ 2. కమాన్ పూర్ మండలం రొంపి కుంట గ్రామంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ గుమ్మడి శ్రీనివాస్ మువ్వన్నెల జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా జాతీయగీతం ఆలపించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఝాన్సీ, వార్డు సభ్యురాలు సుల్తానా, నాయకులు కోలా నరేందర్, భాద్రపు శంకర్, కోల నరస గౌడ్, మాజీ ఎంపిటిసి చొప్పరిగట్టయ్య, కమ్మగొని మల్లయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ హిందుస్థాన్
R. HINDUSTAN
బుధవారం 03 జూన్2026


# ఈదురుగాలుల ఇండ్ల పై కప్పు బాధితులకు కాంగ్రెస్ అండ

## పూసిగూడలో దెబ్బతిన్న ఇండ్లను పరిశీలించిన డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క

### అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు కృషి చేస్తామని హామీ



**సిర్పూర్(యు),నార్నూర్ 02:** నార్నూర్ మండలం పూసిగూడ గ్రామంలో ఇటీవల ఈదురుగాలులతో కూడిన వర్షాల కారణంగా దెబ్బతిన్న ఇండ్లను జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క మంగళవారం పరిశీలించారు. ప్రకృతి వైపరీత్యంతో నష్టపోయిన కుటుంబాలను పరామర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఇటీవల కురిసిన వర్షాలు, బలమైన ఈదురుగాలుల ప్రభావంతో గ్రామంలోని పలువురు పేద కుటుంబాల ఇండ్ల పైకప్పులు ఎగిరిపోవడంతో గృహాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో గ్రామాన్ని సందర్శించిన సుగుణక్క బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పి, ప్రభుత్వం తరపున అవసరమైన సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఇండ్లు దెబ్బతిన్న కుటుంబాలకు ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పైకప్పులు కూలిపోయిన బాధితులతో పాటు ఇల్లు లేని అర్హులైన పేద కుటుంబాలకు కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు.గ్రామస్తులతో సమావేశమైన ఆమె, స్థానిక సమస్యలు, గృహావసరాలు, మౌలిక సదుపాయాల అంశాలపై వివరాలు తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు బ్రీజులాల్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోవింద్, మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు షేక్ మహమ్మద్, సర్పంచులు దిలీప్ రాథోడ్, కుంర జ్ఞానేష్, మానే సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకర్ హర్షినిని సన్మానించిన గౌడ సంఘం



**తిర్యాణి 02:** జేఈఈ అడ్వాన్స్‌డ్-2026లో జాతీయ స్థాయిలో 1487వ ర్యాంకు సాధించి మండలానికి గుర్తింపు తీసుకొచ్చిన బుగ్గుల హర్షినిని మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. తిర్యాణి మండల కేంద్రానికి చెందిన బుగ్గుల సకరాం--ప్రమీల దంపతుల పెద్ద కుమార్తె అయిన హర్షినికి శాలువా కప్పి, జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చి ప్రతిష్ఠాత్మక ఇంజినీరింగ్ విద్యాసంస్థల్లో ప్రవేశానికి అర్హత సాధించడం మండలానికే గర్వకారణమని అభినందించారు. హర్షిని భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్ల శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి మార్క శంకర్ గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మగౌని శంకర్ గౌడ్, మండల అధ్యక్షుడు రంగు వైకుంఠం గౌడ్, యూత్ అధ్యక్షుడు బొంగోని సాగర్ గౌడ్, నాయకులు జుంగోని అశోక్ గౌడ్, పెరుమండ్ల వెంకటేశం గౌడ్, నాగపూరి మహేందర్ గౌడ్, తాళ్ల హరీష్, బందెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సభలో ఎమ్మెల్యేకు మాట్లాడే అవకాశం కల్పించలేదు

## బీఆర్ఎస్ తిర్యాణి మండల అధ్యక్షుడు హన్మండ్ల జగదీశ్



**తిర్యాణి 02:** కాగజ్ నగర్ ఎక్స్ రోడ్ లో సోమవారం నిర్వహించిన ప్రభుత్వ సభలో స్థానిక ఎమ్మెల్యే కోవా లక్ష్మీకి మాట్లాడే అవకాశం కల్పించకపోవడం ఆమెను అవమానించడమేనని బీఆర్ఎస్ తిర్యాణి మండల అధ్యక్షుడు హన్మండ్ల జగదీశ్ ఆరోపించారు. మంగళవారం తిర్యాణిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొమురంభీం ఉద్యమ స్ఫూర్తితో జిల్లా సాధనలో కీలక పాత్ర పోషించిన ఆదివాసీ మహిళా ఎమ్మెల్యే కోవా లక్ష్మీకి సభలో మైక్ ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. స్థానిక ఎమ్మెల్యే హోదాలో సభకు అధ్యక్షత వహించినప్పటికీ మాట్లాడే అవకాశం కల్పించలేదని విమర్శించారు. ఆదివాసీ జిల్లాలో ఆదివాసీ మహిళా ప్రజాప్రతినిధిని అవమానించడం సరికాదన్నారు. ఆదివాసీలు, మహిళలను గౌరవించే విధంగా పాలకులు వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తిర్యాణి ఉప సర్పంచ్ చేని కుమార్, పిఏసిఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, పి ఏ సి ఎస్ వైస్ చైర్మన్ టెంట్ శ్రీనివాస్, మాజి జెడ్పిటిసి ఆత్రం చంద్రశేఖర్, గంభీరావుపేట్ మాజీ సర్పంచ్ ముత్యం రాజయ్య, తిర్యాణి మాజీ ఉప సర్పంచ్ తోట లచ్చన్న, ఆకుల సతయ్య, బుర్ర మధుకర్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

**- మండలవ్యాప్తంగా మిన్నంటిన సంబరాలు**
**-ప్రభుత్వ కార్యాలయాల్లో మువ్వన్నెల రెపరెపలు**







తిర్యాణి,సిర్పూర్(యు),02: మండలవ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వరాష్ట్ర సిద్ధాంతాన్ని స్మరిస్తూ ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ రాజకీయ పార్టీల కార్యాలయాల వద్ద మువ్వన్నెల పతాకాలు రెపరెపలాడాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు జాతీయ జెండాలను ఆవిష్కరించి వందనం సమర్పించారు.

**కార్యాలయాల్లో వేడుకల కోలాహలం:**
స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీనివాస్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమరుల త్యాగాల ఫలమే స్వరాష్ట్ర సాకారమని కొనియాడారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నగేష్, వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏవో వినయ్ రెడ్డి జెండాలను ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

**రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో...**
మండల కేంద్రంలోని వివిధ రాజకీయ పార్టీల కార్యాలయాల్లో ఆయా పార్టీల మండల అధ్యక్షులు జాతీయ జెండాలను ఎగురవేసి వందనం చేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, రాజకీయ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

**సిర్పూర్(యు)02:**
మండలంలోని ప్రభుత్వకార్యాలయాలతో పాటు పాఠశాలలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యలయంలో ప్రల్హాద్ ,ఎంపీడీవో కార్యాలయంలో ఎంపివో ప్రమోద్‌కుమార్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై విక్రమ్, ఎంఈవో కార్యాలయంలో మండల విద్యాధికారి కుడ్మేతా సుధాకర్,ప్రభుత్వ ఆసుప్రతీలలో వైద్యధికారి త్రీవర్ణ పతాకం ఎగురవేసి జాతీయగీతం అలపించారు. గ్రామపంచాయతీల్లో నూతనంగా ఎన్నికయిన సర్పంచులు జెండాలను ఆవిష్కరించారు.

# ఎమ్మెల్యేకు అవమానం జరగలేదు

## కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ అజ్మీర శ్యామ్ నాయక్



**ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి 02:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కోవ లక్ష్మికి ఎలాంటి అవమానం జరగలేదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యామ్ నాయక్ స్పష్టం చేశారు. మంగళవారం తన నివాసంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్ల మంగ తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా కెరమెరి మండలం కొత్తగూడలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కోవ లక్ష్మి అధ్యక్షత వహించారని, అదే కార్యక్రమంతో సీఎం పర్యటన ప్రారంభమైందని తెలిపారు. ఆదిమ గిరిజన తెగలకు చెందిన లబ్ధిదారుల ఇందిరమ్మ గృహాలను ముఖ్యమంత్రి ప్రారంభించి ఆదివాసీ సమాజానికి గౌరవం కల్పించారని పేర్కొన్నారు.కొత్తగూడలో స్థలాభావం కారణంగా బహిరంగ సభను కాగజ్‌నగర్ క్రాస్‌రోడ్ వద్ద ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గృహప్రవేశ కార్యక్రమంలో సభాధ్యక్షురాలిగా ఉన్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి జిల్లా సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. ఆ అంశాలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా ముఖ్యమంత్రికి వివరించారని తెలిపారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వంతెనలు, ప్రాజెక్టులు సహా పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి స్వయంగా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. సీఎం పర్యటనలో భాగంగానే బహిరంగ సభ నిర్వహించగా, సమయాభావం కారణంగా కొంతమందికి మాట్లాడే అవకాశం రాలేదని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యేతో పాటు జిల్లాకు చెందిన ఎమ్మెల్సీకి కూడా ప్రసంగించే అవకాశం దక్కలేదని, ఇతర జిల్లాల నుంచి వచ్చిన పలువురు ఎమ్మెల్యేలు కూడా మాట్లాడలేకపోయారని పేర్కొన్నారు.సభ నిర్వహణ కన్వీనర్‌గా వ్యవహరించిన రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్ ప్రేమ్‌సాగర్ రావు తన హోదా మేరకు ప్రసంగించారని వివరించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేను మాట్లాడనివ్వలేదనే ఆరోపణలు వాస్తవాలకు విరుద్ధమని అన్నారు.జిల్లాలో వైద్యుల కొరత అంశంపై మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 977 మంది వైద్యులు, 600 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించిందని తెలిపారు. అయితే జిల్లాలో విధులు నిర్వర్తించేందుకు కొంతమంది వైద్యులు ఆసక్తి చూపడం లేదని చెప్పారు. ఇతర జిల్లాల కంటే అదనంగా రూ.50 వేల ప్రోత్సాహక వేతనం ప్రకటించినప్పటికీ ఆశించిన స్పందన రావడం లేదన్నారు.ఆదివాసీ మహిళా ఎమ్మెల్యే అయిన కోవ లక్ష్మిని అవమానించారని చేస్తున్న ఆరోపణలపై ప్రజలే వాస్తవాలను అర్థం చేసుకోవాలని అజ్మీర శ్యాం నాయక్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఎండి నిజాం, రాపర్తి మురళి, గజుల జక్కయ్య, మెకార్తి కాశయ్య, గుగ్లోత్ రవి, తాజ్ తదితరులు పాల్గొన్నారు.

# బడి ఈడు పిల్లలందరికీ ప్రవేశాలు కల్పించాలి

## ఏసీఎంఓ పూర్కా ఉద్ధవ్



**ఆసిఫాబాద్ 02:** ఆచార్య జయశంకర్ బడి బాట కార్యక్రమాన్ని విజయవంతం చేసి బడి ఈడు పిల్లలందరికీ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించాలని ఏసీఎంఓ పూర్కా ఉద్ధవ్ సూచించారు. కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని పీఎంఆర్సీలో మంగళవారం ఆసిఫాబాద్, మొవాడ్ స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలోని ఉపాధ్యాయులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను మ్యాపింగ్ చేసి ప్రతి ఇంటిని సందర్శించి బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలు, గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న బడి ఈడు చిన్నారుల వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫారాలు, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తల్లిదండ్రులకు వివరించాలని కోరారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు.గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తు లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కూడ్మేత జంగు, ఎస్‌సీఆర్‌పీలు రాథోడ్ రవీందర్, కూడ్మేత అనంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సీఎం వ్యాఖ్యలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయి

### పీఎం జన్మన్ కేంద్ర ప్రభుత్వ పథకమే
### కాంగ్రెస్ అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని
### బీజేపీ మండల ఎన్నికల కన్వీనర్ పులి వెంకటేష్



**తిర్యాణి 02:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటనలో చేసిన వ్యాఖ్యలు ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ఉన్నాయని బీజేపీ మండల ఎన్నికల కన్వీనర్ పులి వెంకటేష్ ఆరోపించారు. మంగళవారం తిర్యాణిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేరమెరి మండలం కొరారిలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి, అన్ని అభివృద్ధి పనులు రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే జరుగుతున్నట్లు ప్రచారం చేశారని విమర్శించారు. పీఎం జన్మన్ పథకం కేంద్ర ప్రభుత్వం 2023-24లో ప్రారంభించిన ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమమని తెలిపారు. ముఖ్యంగా అత్యంత వెనుకబడిన గిరిజన సమూహాల (పీవీటీజీ) అభ్యున్నతి కోసం ఈ పథకం అమలవుతోందన్నారు. తాగునీరు, సీసీ రోడ్లు, విద్యుత్, పాఠశాలలు, మల్టీపర్పస్ కేంద్రాలు వంటి సదుపాయాలు కేంద్ర ప్రభుత్వ నిధులతో కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై స్పష్టత లేదని, రైతు భరోసా కూడా పూర్తిస్థాయిలో అందడం లేదని ఆయన విమర్శించారు. ప్రజలకు వాస్తవాలు తెలుసని, కాంగ్రెస్ నాయకులు అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని హెచ్చరించారు.

# విద్యుత్ శాఖ ఉత్తమ ఉద్యోగిగా చల్లూరి కృష్ణ



**తిర్యాణి 02:** విద్యుత్ శాఖలో అందిస్తున్న ఉత్తమ సేవలకు గాను తిర్యాణి విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ లైన్‌మెన్ (ఏఎల్ఎం) చల్లూరి కృష్ణ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉద్యోగి అవార్డుకు ఎంపికయ్యారు. మంగళవారం వరంగల్‌లో ఘనంగా నిర్వహించిన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్‌పీడీసీఎల్) సంస్థల చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) కర్నాటి వరుణ్ రెడ్డి చేతుల మీదుగా కృష్ణ ఈ అవార్డును స్వీకరించారు. విధుల్లో ప్రతిభ కనబరిచినందుకు గాను ఈ గుర్తింపు లభించడం పట్ల చల్లూరి కృష్ణ హర్షం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖలో తాను అందిస్తున్న సేవలను గుర్తించి అవార్డు అందించడం ఎంతో సంతోషంగా ఉందని, భవిష్యత్తులో మరింత బాధ్యతాయుతంగా పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. కృష్ణకు అవార్డు రావడం పట్ల తిర్యాణి విద్యుత్ శాఖ అధికారులు, తోటి సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# సర్పంచ్ చొరవతో పునరుద్ధరించిన నీటి సరఫరా



**,తిర్యాణి 02:** మంగీ గ్రామపంచాయతీ పరిధిలోని తల్లపేట్ గూడలో బోర్వెల్ మోటారు దెబ్బతినడంతో ఏర్పడిన తాగునీటి సమస్యను సర్పంచ్ రాయిసీడం వినోద్ కుమార్ వెంటనే పరిష్కరించారు. కొత్త మోటారును ఏర్పాటు చేయించి బోర్వెల్ మరమ్మతులు చేపట్టడంతో నీటి సరఫరా పునరుద్ధరైంది. సమస్యను తక్షణమే పరిష్కరించిన సర్పంచ్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.